అభివృద్ధి పనుల ప్రారంభం

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లి శ్మశాన వాటికలో మౌలిక వసతుల కల్పన కోసం రూ. 40 లక్షల నిధులతో ప్రహరీ, బోర్, సిట్టింగ్ గ్యాలరీతో పాటు ఇతర పనులకు గురువారం డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి, పలుగుచెరువు మహేశ్ భూమి పూజ చేశారు. ఉప్పర్‌పల్లిలోని శ్మశాన వాటిక అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను విన్నవించగా వెంటనే స్పందించి నిధులను మంజూరు చేయించడంతో పనులను ప్రారంభించడం జరిగిందని నాయకులు అన్నారు. ఈ పనులు పూర్తయిన అనంతరం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పెంజర్ల మోహన్, సీనియర్ నాయకులు అనుముల జాన్‌పాల్, సన్న జగన్, పలుగుచెరువు శ్రీనివాస్, పెంజర్ల సీతారం, అదిరాల సంజీవ, పలుగుచెరువు మహేందర్, భరత్ రెడ్డి, సిరాజ్, విశాల్, వడ్డకొండ మహేశ్, సురేశ్, రాజుకుమార్, అదిరాల జగన్, ఇటికాల రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ఆక్రమణలను తొలగిస్తాం

నార్సింగి ట్రాఫిక్ ఎస్ఐ రాజేశ్‌గౌడ్



అలకాపూర్‌లో రోడ్లను పరిశీలించిన ట్రాఫిక్ ఎస్ఐ రాజేశ్‌గౌడ్

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్‌లో పెరగుతున్న ఫుట్‌పాత్, రోడ్ల ఆక్రమణలను త్వరలోనే తొలగిస్తామని ట్రాఫిక్ ఎస్ఐ రాజేశ్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన టౌన్‌షిప్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశీ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఆయన టౌన్‌షిప్‌లోని ప్రధాన రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ... టౌన్‌షిప్‌లో ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలపటం, ఫుట్‌పాత్‌లు, రోడ్లను ఆక్రమించి షెడ్‌లు, వ్యాపారాలను నిర్వహిస్తున్నారన్నారు. వాటితో సామాన్య ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారటంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మున్సిపల్ అధికారులకు లేఖ రాసి త్వరలోనే వాటిని తొలగిస్తామన్నారు.

10 ప్రైవేటు బస్సుల సీజ్

రవాణా శాఖ అధికారుల తనిఖీలు



బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

రాజేంద్రనగర్: పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా గురువారం రవాణా శాఖ అధికారులు ప్రైవేటు బస్సుల తనిఖీలను ప్రారంభించారు. ఉదయం రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని అప్పా చౌరస్తా, ఆరాంఘర్ చౌరస్తా ప్రాంతాల్లో రవాణా శాఖ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 10 బస్సులను గుర్తించి సీజ్ చేశారు. ఉదయమే అధికారుల బృందం ప్రైవేటు బస్సుల తనిఖీని ప్రారంభించారు. ప్రతి బస్సును ఆపి ధ్రువపత్రాలన్నింటినీ పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులను నమోదు చేశారు. ఈ తనిఖీల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి



రెవెన్యూ సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్

మణికొండ: రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టం తెచ్చిందని, అందులో భాగంగా ప్రతి గ్రామంలో నిర్వహించే రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మణికొండ మర్రిచెట్టు పక్కన కమ్యూనిటీ హాల్‌లో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, శివపురి కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్, మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, నాయకులు బి.రవికాంత్‌రెడ్డి, బి.సాయిరెడ్డి, జె.సిద్దప్ప, ఎం.రాఘవరెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లతో దడ



- అధ్వానంగా అంతర్గత రహదారులు
- నిధులు మంజూరైనా జరగని పనులు
- గడువు పూర్తి కావస్తున్నా స్పందన నిల్
- వాహనదారులకు తప్పని ప్రమాదాలు

శంషాబాద్ రూరల్: ప్రధాన, అంతర్గత రోడ్లన్నీ గుంతలమయమై అధ్వానంగా తయారయ్యాయి. దీంతో పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఒక్కోసారి ప్రమాదాల బారినా పడుతున్నారు. గుంతలు పడిన రోడ్లపై ఇళ్ల ముందు వరదనీరు నిలిచిపోతుంది. నిధులు మంజూరై రెండేళ్లు కావస్తున్నా పనులు చేపట్టడంలేదు. మండలంలోని నర్కూడ మేజర్ పంచాయతీలో ప్రధానంగా ఉన్న అంతర్గత రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- శంషాబాద్-షాబాద్ రహదారి- కవ్వగూడ రోడ్డును అనుసంధానం చేసే ఈ మార్గం ఎస్సీ కాలనీ మీదుగా వెళ్తుంది. దాదాపు కిలోమీటరు దూరం ఉన్న రోడ్డును సీసీ రోడ్డుగా మార్చడానికి నిధులు మంజూరు చేశారు.



ఇంద్రారెడ్డి కాలనీలో మట్టి రోడ్డు

రెండేళ్లు కావస్తున్నా...

ఈ మార్గంలో సీసీ రోడ్డు ఏర్పాటుకు ఎంఆర్ఆర్ నుంచి రూ. 54 లక్షలు మంజూరయ్యాయి. పనుల కోసం 22 ఆగస్టు 2023లో ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పనులు ప్రారంభించడంలేదు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు నిర్లక్ష్యం కారణంగానే రోడ్డు పనులు జరగడంలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లన్నీ గుంతల మయం...

గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఉన్న ఈ రోడ్డు గుంతల మయంగా మారింది. వరదనీరు గుంతల్లో నిలిచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. వర్షాకాలంలో రోడ్డు బురదగా మారి నడవడానికి కూడా కష్టంగా ఉందని చెబుతున్నారు. కొన్ని చోట్ల రోడ్డు కబ్జాకు గురవుతుంది. రోడ్డుకు ఇరువైపులా కొత్తగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో.. రోడ్డు ఎత్తు తగ్గిపోయి ఇబ్బందులు తప్పడంలేదు.

పదేళ్ల కిందట మరమ్మతులు...

ఈ మార్గంలో పదేళ్ల కిందట కొంత దూరం వరకు బీటీ రోడ్డు వేసి మరమ్మతులు చేపట్టారు. సుమారు 20 ఏళ్ల కిందట పలు దఫాలుగా సీసీ రోడ్డు వేయగా.. తర్వాత బీటీ రోడ్డుగా మార్చారు. ప్రస్తుతం వరద నీరు రోడ్డుపై పారి గుంతలు ఏర్పడడంతో సీసీ రోడ్డు వేయాలని నిర్ణయించారు. ఇందుకోసం నిధులు మంజూరు అయినప్పటికీ పనులు జరగకపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంద్రారెడ్డి కాలనీలో...

చౌదరిగూడ పంచాయతీలోని ఇంద్రారెడ్డి కాలనీలోని ప్రధాన రోడ్డు సైతం అధ్వానంగా మారింది. ఎగువ భాగం నుంచి వరద నీరంతా ఈ రోడ్డుపై పారుతుంది. దీంతో రోడ్డు గుంతలు పడి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో సుమారు 60 కుటుంబాలు ఉండగా.. ఇళ్లకు చేరుకోవడానికి ప్రధాన రోడ్డు మార్గం అధ్వానంగా మారి ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం కురిస్తే రోడ్డుపై వెళ్లడం కష్టంగా ఉందని స్థానికులు చెబుతున్నారు.

రోడ్డు పనులు చేపట్టాలి



నర్కూడలో సీసీ రోడ్డు కోసం నిధులు మంజూరైనా పనులు చేయడంలేదు. అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా చర్యలు తీసుకోవడంలేదు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు చొరవ తీసుకుని పనులు చేపట్టాలి.

– టి.అశోక్, నర్కూడ

కాలనీలో రోడ్డు వేయించాలి



ఇంద్రారెడ్డి కాలనీలో రోడ్డు వేసి జనం ఇబ్బందులను తొలగించాలి. వర్షం వస్తే మట్టి రోడ్డుపై నడవడం కూడా కష్టంగా మారుతుంది. ఏళ్ల నుంచి రోడ్డు కోసం మొరపెట్టుకుంటున్నా ఎవరూ స్పందించడంలేదు. ఇప్పటికైనా నా ప్రజల ఇబ్బందులు గమనించి రోడ్డు వేస్తే బాగుంటుంది.

– ఎం.మల్లేష్, చౌదరిగూడ

కొత్తగా టెండర్లు వేశాకే...

నర్కూడలో సీసీ రోడ్డు కోసం మంజూరైన పనుల గడవు ఆగస్టుతో ముగిసిపోతుంది. ఆలోపు పనులు జరగడం కష్టమే. ఆగస్టు తర్వాత ఈ పనుల కోసం కొత్తగా టెండర్లు వేసి పనులు చేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టరు పనులు చేయడానికి ముందుకు రాకపోవడంతోనే ఆలస్యం జరిగింది.

– రాహుల్, ఏఈ, పంచాయతీరాజ్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యవంతంగా ఉంటారని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్, కమిషనర్ ఆదేశాల మేరకు వంద రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం కార్పొరేషన్ 9వ డివిజన్ భరత్‌నగర్ కాలనీలో తడి, పొడి, హానికర చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే 17వ డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించారు. జి.వెంకట్‌రెడ్డి, శానిటరీ జవాన్లు సురేష్, శ్రీధర్, యాదగిరి, రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ సబంధ మరమ్మతు పనుల కారణంగా కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. దుర్గానగర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు దుర్గానగర్, దుర్గాహిల్స్, టీఎన్‌జీవోస్ కాలనీ, అయ్యప్ప స్వామి దేవాలయం, మైలార్‌దేవ్‌పల్లి కల్లు కంపౌండ్, శాంతినగర్, గణేష్‌నగర్, స్వప్న థియేటర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

ఎంఐఎంకు తొత్తుగా ప్రభుత్వం తీరు: ఎంపీ కొండా

మైలార్‌దేవ్‌పల్లి: ఎంఐఎం పార్టీకి తొత్తుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లిలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో అరెస్టైన యువకులను గురువారం బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజుభూపాల్‌గౌడ్, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్‌తో కలిసి చంచల్‌గూడ జైలులో పరామర్శించారు. విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంఐఎం కార్యకర్తలను అరెస్టు చేసే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నగరంలో కాంగ్రెస్ రోహింగ్యాలను, బంగ్లాదేశీయులను పెంచి పోషిస్తోందన్నారు. ఒక వర్గం వారు గోవులను అక్రమంగా తరలిస్తున్నారని, ఆవులకు సంబంధించిన ఎముకలను చెరువుల దగ్గర పడేస్తున్నారని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా



బాధితులతో మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, తోకల శ్రీనివాస్‌రెడ్డి

ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఎముకలను అక్రమంగా తరలించి కల్తీ నూనెను తయారు చేస్తున్నారని ఆరోపించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవడం, దాన్ని అడ్డుకోవడం చేతకాని అధికారులను తమ కార్యకర్తలను అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. తక్షణమే అరెస్టులను ఆపాలని డిమాండ్ చేశారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

శంషాబాద్: శంషాబాద్ మండలంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.వై.ప్రణయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఎంఈవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలల్లోనే పుస్తకాల విక్రయాలు జరుగుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. ఫీజులు కూడా అడ్డగోలుగా పెంచి పేద ప్రజలను దోచుకుంటున్నారన్నారు. అర్హత లేని ఉపాధ్యాయులతో బోధన చేపడుతుండటంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సరైన నిబంధనలను పాటించని పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అగ్రి వర్సిటీలు కొత్త వ్యూహాలు అమలు చేయాలి

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

ఏజీ వర్సిటీ: సన్న, చిన్న కారు రైతుల ప్రయోజనాల కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయాలు కొత్త వ్యూహాలను అమలు చేయాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం కోదండరాం అన్నారు. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో 'అద్భుతమైన వారసత్వం-భవిష్యత్తు స వాళ్లు' అనే అంశంపై ఆయన మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత దేశ ఆహార అవసరాలు తీర్చే ఉద్దేశంతో అన్ని రాష్ట్రాల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఏర్పడ్డాయని, అందులో భాగంగానే హైదరాబాద్‌లో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటైందన్నారు. భూ సంస్కరణలు, హరిత విప్లవాలు సత్ఫలితాలు ఇచ్చినప్పటికీ కొన్ని అసమానతలకు కారణం అయ్యాయని తెలిపారు. తెలంగాణలో రైతులు తీవ్ర దుర్భర పరిస్థితుల్ని ఎదుర్కొన్నారని, చివరికి చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడే దుస్థితి ఏర్పడిందన్నారు. రైతులకు ఉత్పత్తి వ్యయం పెరిగిపోతుండడంతోపాటు పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం సహా అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ ఖాళీలు ఉన్నాయని, ప్రభుత్వం వాటిని భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులు, వ్యవసాయం సుభిక్షంగా ఉండాలంటే వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ విశ్వవిద్యాలయాలు సమన్వయంతో పనిచేయాలని మాజీ ఐఏఎస్ అధికారి నాగిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా 60 ఏళ్ల విశ్వవిద్యాలయం ప్రస్థానానికి సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ జానయ్య, మాజీ వీసీ రఘువర్ధన్‌రెడ్డి, ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ రాజిరెడ్డి, పశువైద్య విశ్వవిద్యాలయం వీసీ జ్ఞాన ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.





చింతల్‌మెట్ పాఠశాలకు హాజరైన విద్యార్థులు



హైదర్షాకోట్ స్కూల్‌లో విద్యార్థులకు యూనిఫామ్‌లను అందజేస్తున్న డీఈవో సుశీందర్‌రావు



అత్తాపూర్ ప్రభుత్వ పాఠశాలలో...

మోగిన బడి గంటలు

- విద్యార్థుల రాకతో పాఠశాలలు కళకళ
- సర్కారు బడుల్లో తగ్గిన హాజరు శాతం
- విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్య పుస్తకాల పంపిణీ

శాస్త్రిపురం: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు సందడి చేశారు. అయితే దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం విద్యార్థులు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వేసవి సెలవుల్లో ఎలా గడిపామనే విషయాన్ని విద్యార్థులు పరస్పరం చర్చించుకుంటూ కనిపించారు. పై తరగతికి వెళ్లడంతో పలువురు విద్యార్థులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని చింతల్‌మెట్ ఉర్దూ మీడియం, తెలుగు మీడియం, ఎన్‌టీఆర్ నగర్, శాస్త్రిపురం పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు పుస్తకాలను అంజేశారు. వర్షం కారణంగా విద్యార్థుల హాజరు శాతం తగ్గిందని ఉపాధ్యాయులు తెలిపారు.

శివరాంపల్లిలో...

రాజేంద్రనగర్: బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, 2 జతల యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నదన్నారు. ఈ వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. రాజేంద్రనగర్ ఎంఈఓ శంకర్ రాథోడ్, గుడిమల్కాపూర్ వ్యవసాయ కమిటీ డైరెక్టర్ బండారి శంకర్, హెచ్‌ఎం కిషన్ నాయక్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సునిత, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను సర్కారు బడుల్లో చేర్పించాలి: డీఈవో

బండ్లగూడ: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే వారికి బంగారు భవిష్యత్తు అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తారని డీఈవో సుశీందర్‌రావు అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని మంచి ఉద్యోగాలు సంపాదించుకోవాలన్నారు. కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర, ఎంఈవో విజయ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సైదిరెడ్డి, వివిధ పార్టీల నాయకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

అత్తాపూర్: ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీలత, హైదర్‌గూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మలాజ్యోతి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ వాణి, రాజేంద్రనగర్ మండల పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి శ్రీనివాససాగర్, ఉపాధ్యాయులు సాయిప్రసాద్ పిలుపునిచ్చారు.



హైదర్‌గూడ పాఠశాలలో...

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫామ్‌లు, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అందించారు. ఉపాధ్యాయులు భాస్కర్, సాయి, ప్రసాదరావు, రజియాబేగం, సుజాత, రంగారెడ్డి, సురేష్, మధులత తదితరులు పాల్గొన్నారు.

మణికొండ, నార్సింగిలో...

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉండి వారికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను ఉచితంగా కల్పిస్తున్నదని మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వారు విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నోటు, పాఠ్య పుస్తకాలతో పాటు స్కూల్ డ్రస్‌లను అందజేశారు. మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి, ప్రదానోపాధ్యాయుడు నిరంజన్, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాబుల్‌రెడ్డినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు నోటు, పాఠ్య పుస్తకాలతో పాటు యూనిఫామ్‌లను అందజేశారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు పాండుయాదవ్, సీనియర్ నాయకులు రమేష్‌రెడ్డి, సంతుగౌడ్, వెంకటరమణగుప్తా, గోపాల్‌నాయక్, బబ్లు, ఎన్ను శంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అనిత, ఎ.వినోద్‌కుమార్, సి.విజయలక్ష్మి, ఆర్.భారతి, వై.పార్వతి తదితరులు పాల్గొన్నారు.



నార్సింగిలో...



మణికొండలో...



బాబుల్‌రెడ్డినగర్‌లో మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి